రేషన్ కోసం తిప్పలు

- మూలన పడేసిన ఎండీయూ వాహనాలు
- రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ
- ఎండలో మహిళలు, వృద్ధుల అవస్థలు
- జేసీ, డీఎస్ఓ ఆదేశాలు బేఖాతర్


సరుకుల కోసం రేషన్ షాపు వద్ద గుమికూడిన ప్రజలు


గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎండీయూ వాహనం


సరుకులు మోసుకెళ్తున్న వృద్ధుడు

గుంతకల్లు రూరల్: రేషన్ సరుకులను నేరుగా ప్రజల ఇంటి వద్దకే చేర్చాలన్న మహోన్నత లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండీయూ) వెహికల్స్‌ను కొనుగోలు చేసింది. గత ఐదు సంవత్సరాల పాటు ఆపరేటర్లు ఎండీయూ వాహనాల్లో ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఎండీయూ వాహనాలను మూలన పడేసి, డీలర్లు రేషన్ షాపులోనే సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బాల్లో తూకాలు చేపడుతూ ప్రతి పది కిలోలకు ఒక కిలో చొప్పున దోచుకుంటున్నారు. గుంతకల్లు అర్బన్‌లో 70 రేషన్ షాపులు, రూరల్‌లో 39 రేషన్ షాపులు కలిసి మండల వ్యాప్తంగా 109 రేషన్ షాపులు ఉన్నాయి. మండలంలో దాదాపు సగం మంది రేషన్ డీలర్లు ఎండీయూ వాహనాలను పక్కనపెట్టి రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీ చేపడుతున్నారంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండలు మండుతున్న నేపథ్యంలో మార్చి నెలలో భయటకు వెళ్లడానికి కూడా ప్రజలు భయపడాల్సిన పరిస్థితి. అంతటి ఎండలో కూడా రేషన్ సరుకుల కోసం ప్రజలు రేషన్ షాపుల వద్ద క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అన్ని గ్రామాల్లో మాదిరిగానే గతంలోఉన్న రేషన్ డీలర్‌ను తొలగించి అధికార పార్టీకి చెందిన మద్దతుగా ఉన్న మహిళా సంఘం సభ్యురాలికి రేషన్ డీలర్ బాధ్యతలు అప్పజెప్పారు. దాదాపు 730 రేషన్ కార్డులున్న నెలగొండతోపాటు 505 రేషన్ కార్డులున్న వెంకటాంపల్లి, 298 రేషన్ కార్డులున్న చింతలాంపల్లి గ్రామాలకు కలిపి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాన్ని మొదటి రెండు నెలలు బాగానే ఉపయోగించుకున్నారు. ఆ తరువాత ఎండీయూ వాహనాన్ని పక్కనపెట్టి రేషన్ షాపులోనే సరుకులు పంపిణీ చేస్తున్నారు. రేషన్ షాపు వరకూ వెళ్లి తెచ్చుకోవడానికి ఇబ్బందిగా మారడంతో గ్రామస్తులతో కలసి ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు గత ఏడాది జాయింట్ కలెక్టర్‌తో పాటు, జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫిర్యాదు చేశాడు. ఎండీయూ వాహనంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఒక నెల రోజులు ఎండీయూలో పంపిణీ చేసి, మళ్లీ రేషన్ షాపులోనే రేషన్ పంపిణీ ప్రారంభించారు. ఫిబ్రవరిలో కార్డుదారులు మరోసారి జాయింట్ కలెక్టర్‌కు, డీఎస్ఓకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో డీఎస్ఓ గ్రామంలో పర్యటించి ఎట్టి పరిస్థితుల్లోనూ రేషన్ షాపులో సరుకులు పంపిణీ చేయకూడదని, ఎండీయూ వాహనంలో రేషన్ పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని డీలర్ రేషన్ షాపులోనే సరుకుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నారు. స్వయానా జాయింట్ కలెక్టర్, డీఎస్ఓ ఆదేశించినా లెక్కచేయకపోవడంతో దిక్కుతోచని ప్రజలు మండే ఎండలోనే రేషన్ షాపు వరకూ వెళ్లి గంటల తరబడి అక్కడ వేచిఉండి నానాపాట్లు పడుతూ రేషన్ తెచ్చుకుంటున్నారు.

అర కిలోమీటర్ వెళ్లాలి



గతంలో ప్రతినెలా ఇంటి వద్దకే రేషన్ తీసుకువచ్చి ఇచ్చేవాళ్లు. అప్పుడు ఏ ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు రేషన్ షాపు వద్దకే వచ్చి సరుకులు తీసుకెళ్లమంటున్నారు. మా ఇంటికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న రేషన్ షాపు వరకూ వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. మళ్లీ ఇంటి వద్దే రేషన్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటే మాలాంటి వృద్ధులకు మేలు చేసినవాళ్లవుతారు.

– లక్ష్మీదేవి, వృద్ధురాలు నెలగొండ

ఇబ్బందిగా ఉంది



ఇంటింటికీ తిరిగి బియ్యం వేసే వాహనాన్ని పక్కనపెట్టి స్టోర్‌లో బియ్యం వేస్తున్నారు. మా ఇంట్లో వాళ్లు ఉదయాన్నే పనులకు వెళ్తారు. ఇంటిని కాచుకుని ఉండే నేనే బియ్యం కోసం స్టోర్‌కు వెళ్లాల్సి వస్తోంది. కళ్లు కూడా సరిగా కనబడని నేను అంతదూరం వెళ్లి రేషన్ తీసుకురావాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. రేషన్ షాపు దగ్గర కూడా చాలాసేపు నిలబడాల్సి వస్తోంది.

– ఓబుళమ్మ, వృద్ధురాలు, నెలగొండ

అధికారులు మందలించినా మార్పులేదు



ప్రభుత్వం మారాక రెండు నెలలు మాత్రమే ఎండీయూలో రేషన్ పంపిణీ చేపట్టారు. అప్పటి నుంచి వాహనాన్ని పక్కనపెట్టి రేషన్ షాపులో సరుకుల పంపిణీ చేపడుతున్నారు. గ్రామస్తుల ఇబ్బందులు గుర్తించి ఇప్పటివరకూ ఆరు సార్లు జాయింట్ కలెక్టర్, డీఎస్ఓకు ఫిర్యాదు చేశాం. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ ఉన్నతాధికారులు మందలిస్తున్నా డీలర్ మాత్రం తన పద్ధతి మార్చుకోవడం లేదు.

– ఎం.వీరాంజనేయులు, గుంతకల్లు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తాడిపత్రిటౌన్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలోని సాయి చైతన్య స్కూల్ విద్యార్థులు అర్షియా, నవ్యశ్రీ ఎంపికైనట్లు కరస్పాండెంట్ (కోచ్) లక్ష్మీనరసింహ ఆదివారం తెలిపారు. ఈనెల 9న గుంతకల్లు ఆంధ్ర కబడీ అసోసియోషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 36వ కబడ్డీ జూనియర్ బాలికల పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యారన్నారు.

మోడల్ పరీక్షలతో ఉపయుక్తం


మోడల్ టెస్ట్ పేపర్లు విడుదల చేస్తున్న తహసీల్దార్ రమాదేవి, తదితరులు

గుంతకల్లు: కాంపిటీషన్ పరీక్షలు పాల్గొనే యువతకు మోడల్ పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఆదివారం స్థానిక శ్రీ సాయి మహిళ డిగ్రీ కళాశాలలో పట్టణ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏపీ కానిస్టేబుల్ మెయిన్స్, ఆర్ఆర్‌బీ, గ్రూప్–డీ మోడల్ టెస్టులను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ కాంపీటీషన్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మోడల్ టెస్టు ఒక దిక్సూచిలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రభాకర్, సీసీ శ్రీధర్, డివైఎఫ్ఐ నాయకులు రంగా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి


మహిళా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత, సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని మహిళా సంఘం నియోజకవర్గం కార్యదర్శి మహముదా కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మహిళా సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులు, అరాచకాలు అధికమయ్యాయన్నారు. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రామదాసు, నజీర్, మహిళా సంఘం నాయకులు మాబ్బీ, రామలక్ష్మి, రసూల్ బీ, కమ్మక్క, రెహనా, దస్తగీర్, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో శనివారం అగ్ని ప్రమాదంలో చీనీ చెట్లు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు మాట్లాడుతూ పెనకచెర్ల గ్రామంలో రైతులు అనిల్, హరి పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటల్లో చీనీచెట్లు, డ్రిప్పు, పైపులు కాలిపోయి దాదాపు రూ.20 లక్షలు నష్టం జరగడం బాధాకరమన్నారు. పోలీసులు వెంటనే నిందితు లను పట్టుకుని శిక్షించాలన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి రైతులకు న ష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. సర్వలోక మానవ పరిహారార్థం క్రీస్తు ఈ లోకానికి రిక్తుడిగా వచ్చాడన్నారు. శిలువలో తన అమూల్యమైన రక్తాన్ని చిందించి మనలను పాప విముక్తులను గావించాడన్నారు. క్రీస్తుకు సారూప్యంగా జీవించినప్పుడే మన జీవితాలు ఫలప్రదమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, పీసీ రత్నరాజు, జకరయ్య, అబ్రహాం, ఆనంద్‌రాజ్, బుజ్జిబాబు, రాజు, కరుణాకర్, ప్రసాద్, రజని, పాస్టరమ్మ సువర్ణమ్మ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, రేచెల్, మెర్సీ, వాణి, మహిమ, క్రైస్తవులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్

శింగనమల: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ తీరుపై ఈనెల 12న జిల్లా కేంద్రంలో చేపట్టిన యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం శింగనమల రామాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యా రంగానికి పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చిందని, కాని ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలలకే విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.3900 కోట్లు అయితే బడ్జెట్‌లో కేవలం రూ.700 కోట్లు కేటాయించారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులపై కళాశాలలు ఒత్తడి తీసుకువస్తున్నాయన్నారు. కొంతమంది విద్యార్థులు వత్తడి భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవచ్చారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించి, విద్యార్థుల ఉన్నతికి తోడ్పడ్డారన్నారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో చేపట్టే వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చాములూరు రాజగోపాల్, నవీన్, సిద్దరాచెర్ల సర్పంచ్ రామాంజినేయులు, రంగస్వామి, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు బెస్త ప్రసాద్, అబ్దుల్, రాజు, వెంకటప్ప, నాగర్జున, మాజీ గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, గంగాధర్, నారాయణస్వామి, మహేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి


వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

గుత్తి: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా కలసికట్టుగా పని చేయాలని పార్టీ వ్యవసాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లయ్యయాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు సూచించారు. గుత్తి ఆర్ఎస్‌లోని జిల్లా నాయకుడు బళ్లారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు రాజ్ కుమార్‌రెడ్డి నూతనంగా ఎన్నికైన పట్టణ, మండల కన్వీనర్లు, వ్యవసాయ విభాగం రాష్ట్ర కార్యదర్శిని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది మాసాల పూర్తి కాకముందే ప్రజలు నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, డాక్టర్ శాంతి ప్రియ, నాయకులు సుభాష్‌రెడ్డి, రంగస్వామి, హరినాథ్ రెడ్డి, హరి, రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, భీమలింగ, 24వ వార్డు హరి, పవన్, గద్దల నాగేంద్ర, కె.ఎం.రంగనాయకులు, చిన్నా, డాడీ, రమేష్ రెడ్డి, వీరాంజనేయులు, కుమార్, నాగిరెడ్డి, మల్లి, కౌన్సిలర్లు వరదరాజులు, కేవీ రమణ, ఖాజా ఖాన్, మైనార్టీ నాయకులు ఫయాజ్, మర్తాడు అన్వార్, బాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ


గవిమఠ చంద్రమౌళీశ్వర స్వామికి పట్టువస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఉరవకొండ గవిమఠం సంస్థానంలో జరుగుతున్న చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా ఆలయ ఈఓ రాణి విన్నపం మేరకు కసాపురం దేవస్థానం నుంచి ప్రప్రథమంగా స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు 'యువత పోరు' పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లు: జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ, కూటమి సర్కార్‌పై నిరసన గళమెత్తడానికి జరిగే యువత పోరు కార్యక్రమం పోస్టర్లను సోమవారం విడుదల చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో ఉదయం10 గంటలకు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

శింగనమలలో..

శింగనమల: జిల్లా కేంద్రంలో ఈనెల 12న నిర్వహించే వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం శింగనమలలో అవిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి సాకే శైలజానాథ్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న నాయకులు

గుంతకల్లు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గుంతకల్లు పట్టణంలోని మస్తాన్‌పేట సుంకులమ్మ ఆలయం వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెల రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించి నిలుపుదల చేసిన వివాహాలు, ప్రసవాలు, సహజ మరణాల పరిహారాలను చెల్లించాలన్నారు. పిల్లలు చదువులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, సిమెంట్ ధరలు తగ్గించాలని, ప్రమాదాలు, అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యమాలకు సిద్ధం కండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు: ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టో అమలు కావాలంటే పోరాటాలతోనే సాధ్యమవుతుందని, ఈ నేపథ్యంలో ఉద్యమాలకు సిద్ధం కావాలని జిల్లా ప్రజలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం గుంతకల్లులోని సీపీఎం కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాంభూపాల్ మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పీ4 సర్వేను చేపట్టి ఇప్పటికే సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల సంఖ్యను కుదించే కుట్రకు కూటమి సర్కార్ తెరలేపిందని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, సాగునీటి వనరుల అభివృద్ధి, పేదరిక నిర్మూలన తదితర అంశాలకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ గత 9 నెలల్లో అమలు చేయకుండా సీఎం చంద్రబాబు మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీలపై అదనపు భారం వేస్తూనే తమ కూటమి అధికారం వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచలేదని శాసన సభలో మంత్రి రవికుమార్ అవాస్తవాలు చెప్పడం కూటమి బూటకపు పాలనకు నిదర్శనమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారన్నారు. ఇందులో భాగంగానే చర్చిల సర్వే పేరుతో మత విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రకు తెరదీశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, జిల్లా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సాకే నాగరాజు, నాయకులు కసాపురం రమేష్, జగ్గిలి రమేష్, సురేంద్ర, నిర్మల, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి వద్ద లారీని బైక్ ఢీ కొన్న ప్రమాదంలో రామయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రి–అనంతపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ పెట్రోల్ పంపులో రామయ్య పని చేస్తుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం ఓ కారు యజమాని డీజిల్ పట్టించుకుని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. దీంతో కారు వెంబడి బైక్‌పై ప్రయాణిస్తూ వెళ్లిన రామయ్య యర్రగుంటపల్లి వద్దకు రాగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ లారీని ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తి, బీకేఎస్‌లో వాహనాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, రాయల్ సర్కిల్‌లో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్, ఆర్‌సీ, లైసెన్స్ లేని వాహనాల డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం– తాడిపత్రి రహదారిపై ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎస్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం పలువురికి జరిమానాలు విధించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

యల్లనూరు: ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు సృష్టించి, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సత్యబాబు హెచ్చరించారు. ఆదివారం ఆయన యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు.

మహిళా ప్రధాన కార్యదర్శిగా పేరం స్వర్ణలత



తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా తాడిపత్రికి చెందిన పేరం స్వర్ణలతను ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం కోసం రాష్ట్ర అనుబంధ కమిటీ నియామకాలు ఆపార్టీ చేపట్టింది. ఇందులో భాగంగా తాడిపత్రి పట్టణానికి చెందిన పేరం స్వర్ణలతకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సింహవాహనంపై చెన్నకేశవస్వామి



పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రం యాడికిలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సింహవాహనంపై కొలువుదీరారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంరతం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి కాయ, కర్పూరాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రారంభమైన సామాజిక తనిఖీ

పుట్లూరు: మండలంలో ఉపాధి హామీ కింద 2023–2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. ఆదివారం మండలంలోని నాయకునిపల్లి, కందికాపుల గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేశారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో దాదాపు రూ.11 కోట్ల మేరకు పనులపై తనిఖీలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి రక్తదాన శిబిరం

గుంతకల్లు: విశ్వ రోటరాక్ట్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి 16వ తేదీ వరకూ రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణ రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివనంద, శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రక్త కేంద్రంలో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ శిబిరానికి హాజరై రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు.

తాత్కాలిక కమిటీ ఎన్నిక

తాడిపత్రి రూరల్: స్థానిక మార్కండేయ స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం దేవాలయ తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. మే నెలలో నిర్వహించనున్న భద్రావతి, భవనారుషీశ్వరుల కల్యాణోత్సం, తిరునాలను దృష్టిలో ఉంచుకొని కొత్త కమిటీని ఎన్నిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా జలదుర్గందామోదర్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దగ్గరుండి ఎన్నిక చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి ఆలయం, పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవార్లకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు రామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


పొగరూరులో భగవద్గీత ప్రచార దృశ్యం

పామిడి: మండలంలో త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పాల్గుణ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని భగవద్గీత ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని పొగరూరు, నీలూరు, తంబళ్లపల్లి, గజరాంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పాల్గుణ మాసం, హోలీ పౌర్ణమి పండుగల విశిష్ఠతపై వారు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ సమితి గుత్తి కమిటీ అధ్యక్షుడు రవికుమార్, సభ్యులు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, రామాంజనేయులు, శ్రీనివాస్, రాజారావు, సురేష్, శ్రీనాథ్, ఈరన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.